క్లుప్తంగా

రేపు మండల సమావేశం

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఆయన కోరారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు సమావేశానికి తప్పక హాజరు కావాలని తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థినికి స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ప్రిన్సిపల్ కేవీ సుబ్బారావు


మైదుకూరు : పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష కోసం మైదుకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులకు సోమవారం స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ కేవీ సుబ్బారావు మాట్లాడుతూ పాలిటెక్నిక్ కోర్సులలో చేరేందుకు రాష్ట్ర సాంకేతిక విద్యా, శిక్షణ మండలి ఈనెల 30న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోందని తెలిపారు. ఇందు కోసం ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కళాశాలలో తాము నిర్వహిస్తున్న ఉచిత శిక్షణా కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నదని పేర్కొన్నారు. శిక్షణలో భాగంగా 47 మంది విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందించామన్నారు. శిక్షణ ఈనెల 28వ తేదీ వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ హెన్సీ థామస్, శోభావతి, బేబీ శాలిని, సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

అన్నప్రసాద సేవ


శివోహం అన్నప్రసాద సేవా సంఘం సభ్యులు

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎంవీ రమణారెడ్డి 82వ వర్ధంతి సందర్భంగా అన్నప్రసాద సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఎంవీ రమణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, మాజీ వైస్ ఎంపీపీ మల్లెల రాజారాంరెడ్డి, ఆప్కాబ్ మాజీ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఉపాధ్యక్షుడు మురికూటి సూర్యనారాయణరెడ్డి, సభ్యులు విష్ణు నారాయణ, విజయ్‌కుమార్, లింగారెడ్డి, కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


సన్మానం


రామ్మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న విపంచి ఫౌండేషన్ నిర్వాహకులు

పోరుమామిళ్ల : కోలాటం, చెక్కభజన, జడకోపులో అద్భుత ప్రదర్శనలు ఇచ్చి స్వర్ణ నంది అవార్డుతో పాటు తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్న చిత్తారి యల్లయ్యను సోమవారం శ్రీరాంనగర్ రామాలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. శ్రీరామనవమి పర్వదిన సందర్భంగా స్వామి వారి ఊరేగింపులో యల్లయ్య శిష్యబృందం ఇచ్చిన కోలాట ప్రదర్శన ప్రజలను ఉర్రూత లూగించింది.

బి.కోడూరు : గ్రామస్థాయిలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి సామాజిక అభివృద్ధిలో పాత్ర పోషించినందుకు గుర్తించిన విపంచి ఫౌండేషన్ నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి మేకవారిపల్లె గ్రామానికి చెందిన శ్రీశ్రీశ్రీ వీరబ్రహ్మేంద్ర గ్రంథాలయం స్థానం దక్కించుకుంది. ఇందుకు సంబంధించి సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో విపంచి ఫౌండేషన్, తెలంగాణ భాష సంస్కృతిశాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు వీరబ్రహ్మేంద్ర గ్రంథాలయ నిర్వాహకుడు జి.రామ్మోహన్‌రెడ్డిని సన్మానించారు.

హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు

పోరుమామిళ్ల : మండలంలోని శ్రీ మద్దిమాను గురప్పస్వామి ఆలయంలోని హుండీ ఆదాయాన్ని సోమవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రొద్దుటూరు డివిజన్ ఈఓ నరసయ్య ఆధ్వర్యంలో లెక్కించారు. కార్యక్రమాన్ని ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, పోలీసులు, అర్చకులు, గ్రామపెద్దలు పర్యవేక్షించారు. హుండీలో 5 నెలలకు 9,07, 988 ఆదాయం వచ్చినట్లు ఈఓ నరసయ్య తెలిపారు. డబ్బును బ్యాంకులో జమ చేస్తున్నట్లు తెలిపారు.

పరిహారం లేకుండానే రోడ్డు విస్తరణ పనులు


జేసీబీతో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న దృశ్యం


అభ్యంతరం చెప్పడంతో ఆగిన రోడ్డు విస్తరణ పనులు

- సమాధులు తొలగిస్తుండగా అభ్యంతరం వ్యక్తం చేసిన స్థానికులు
- పరిహారానికి బదులు టీడీఆర్ బాండ్లు ఇస్తామన్న అధికారులు

ప్రొద్దుటూరు : సాధారణంగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టే ముందు ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాన్ని నిర్వాసితులతో ఏర్పాటు చేయాలి. ఏ స్థలానికి ఎంత పరిహారం అనే విషయం తేలాకే రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించాలి. ముందుగా ఆ పరిహారాన్ని కూడా చెల్లించాలి. అయితే ఇందుకు భిన్నంగా ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. కొర్రపాడు రోడ్డును వంద అడుగుల రోడ్డు చేయాలనే సంకల్పంతో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కొద్ది రోజుల కిందట అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కొర్రపాడు రోడ్డు, ఆంధ్రకేసరి రోడ్డుతోపాటు పలు రోడ్లకు మార్కింగ్ ఇచ్చారు.

పరిహారం లేకుండానే పనులు మొదలు

కొర్రపాడు రోడ్డుకు సంబంధించి సోమవారం రోడ్డు విస్తరణ పనులను మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. వివేకానంద క్లాత్ మార్కెట్ సమీపంలో పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా నిర్వాసితుల స్థలాల్లోని సమాధులను తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో స్థానికులు అడ్డుకున్నారు. తమకు కనీస సమాచారం లేకుండా.. పరిహారం ఇవ్వకుండా ఎలా పడగొడుతారని అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ కారణంగా అధికారులు పనులను తాత్కాలికంగా నిలిపివేశారు.

> **టీడీఆర్ బాండ్లు ఇస్తాం**
>
> రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి ముందుగా రోడ్డు ఆక్రమణ స్థలాలను గుర్తించి పనులను ప్రారంభించాం. భూ సేకరణకు సంబంధించి సమావేశం ఏర్పాటు చేయలేదు. పత్రికా ప్రకటన విడుదల చేశాం. ప్రస్తుతం నిర్వాసితులకు పరిహార రూపంలో టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ రైట్స్ బాండ్లు) బాండ్లు తయారు చేస్తున్నాం. స్థలాన్ని బట్టి పట్టా స్థలం కోల్పోయిన వారికి స్థలం విలువను బట్టి నాలుగు రెట్లు బాండ్లు ఇస్తాం. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారితోపాటు ప్రభుత్వ స్థలాలకు పరిహారం ఉండదు. సమాధుల తొలగింపునకు సంబంధించి ముందుగా అనుమతి తీసుకున్నాం. మళ్లీ వారి బంధువులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పనులు నిలిపేశాం.
>
> \- మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు

తాగునీటి సమస్యను తీర్చండి

మండల సమావేశంలో సర్పంచ్‌ల వేడుకోలు


ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్ కుమార్‌రెడ్డికి విన్నవిస్తున్న సర్పంచ్ గౌస్ లాజం

మైదుకూరు : పంచాయతీల్లో తాగునీటి సమస్యను తీర్చాలని సోమవారం జరిగిన మైదుకూరు మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సర్పంచ్‌లు అధికారులను కోరారు. ఎంపీడీఓ కేవీ శ్రీధర్ నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్ కుమార్‌రెడ్డి మండలంలో తాగునీటి సౌకర్యాల గురించి మాట్లాడారు. ఆ సమయంలో వనిపెంట సర్పంచ్ గౌస్ లాజం మాట్లాడుతూ వనిపెంటలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడం వల్ల తాగునీటికి ఇబ్బందిగా ఉందన్నారు. ప్రజలకు తాగునీటిని అందించేందుకు కొత్తగా ఓవర్ హెడ్ ట్యాంక్ ఏర్పాటు చేసినా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంలో జాప్యం జరుగుతుండటంతో తాగునీటిని అందించలేకున్నామన్నారు. తిప్పిరెడ్డిపల్లె సర్పంచ్ నాగేంద్ర బాబు మాట్లాడుతూ తమ పంచాయతీ మీదుగా వెళుతున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో పంచాయతీకి చెందిన బోర్‌వెల్ ట్రాన్స్‌ఫార్మర్ తొలగించారని అన్నారు. అయితే అధికారులు తిరిగి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయకపోవడంతో తాగునీటికి ఇబ్బందిగా ఉందన్నారు. పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. హౌసింగ్ ఏఈ బ్రహ్మకుమార్ మాట్లాడుతూ సొంత స్థలం ఉన్న వారు ఇంటి మంజూరు కోసం కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మండల పశువైద్యాధికారి సుధాకర్ మాట్లాడుతూ మొబైల్ పశు చికిత్స వాహనాన్ని (1962) 20 రోజుల్లో పునః ప్రారంభిస్తామన్నారు. పశువుల కోసం నీటి తొట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎంఈఓ పద్మలత మాట్లాడుతూ 3, 4, 5 తరగతులను హైస్కూళ్లలో కలుపుతూ ఇచ్చిన 117 జీఓను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కొత్తగా ఫౌండేషన్, బేసిక్, మోడల్ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేయనుందని తెలిపారు. పాఠశాలల ఏర్పాటులో సర్పంచ్‌ల సహకారం ఇవ్వాలని కోరారు. ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. అయితే ప్రభుత్వం మంజూరు చేసిన ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసే పనులను ప్రారంభించలేదన్నారు. సర్పంచ్‌లు సహకరిస్తే చేయగలుగుతామని లేదంటే చేయలేమని స్పష్టం చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో పనులు చేయకపోవడంతో నిధులు వెనక్కు వెళ్లాయని వెల్లడించారు. సమావేశంలో మండల వైస్ ఎంపీపీ చిన్న కొండమ్మ, కో ఆప్షన్ సభ్యుడు ఇంతియాజ్ ఖాన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం

ప్రొద్దుటూరు : పట్టణంలోని పాతమార్కెట్ రిజర్వాయర్‌కు సంబంధించిన ప్రాంతాల్లో ఈనెల 9, 10 తేదీల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమృత్ పథకం కింద పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్, మెఘా ఇంజనీరింగ్ వర్క్స్ వారు నూతనంగా వేసిన 300 ఎంఎం డయ పంపింగ్ లైన్ నుంచి నీటిని పాతమార్కెట్‌లోని రిజర్వాయర్‌కు పంపింగ్ టెస్ట్ చేయగా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద పైపు లీక్ అయిందని ఆయన పేర్కొన్నారు. పైపు లీక్‌జీని మరమ్మతుల పనులు చేపడుతున్నందున ఈనెల 9, 10 తేదీలలో వె దుర్ల బజార్, వెంగళిరెడ్డిపేట, తిరుమలనాయునిపేట, రాజబాట వీధి, కోట వీధి, ఆదర్శనగర్, అమ్మవారిశాల మెయిన్ బజార్, జోక్‌పాలెం, లైట్‌పాలెం, దస్తగిరిపేట, ఎస్పీయూ కాంపౌండ్, జిన్నా రోడ్డు, గౌరమ్మకట్ట, ఎల్ఐసీ ఆఫీస్ రోడ్డు, హైదర్‌ఖాన్ వీధి, సుందరాచార్యుల వీధి, దర్గాబజార్, త్యాగరాజ వీధి, గంగమ్మ టెంపుల్ వీధి, ఇస్లాంపురం, కోనేటి కాలువ వీధి, రంగయ్యగారి సత్రం వీధి, కొవ్వూరు గ్యారేజీ తదితర ప్రదేశాలకు నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. ఈ ప్రాంతాల ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకుని సహకరించాలని కోరారు.

ఈఓపీఆర్డీపై ఎంపీడీఓకు ఫిర్యాదు

ప్రొద్దుటూరు రూరల్ : విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మండల ఈఓపీఆర్డీపై చర్యలు తీసుకోవాలని మాజీ వార్డు సభ్యుడు మార్తల వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డికి సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కార వేదికలో గత ఆరు నెలల కిందట తాను అర్జీ ఇచ్చానన్నారు. ఆ అర్జీలోని సమాచారాన్ని తనకు ఇప్పటికీ ఇవ్వకుండా ఈఓపీఆర్డీ నిర్లక్ష్య ధోరణిగా వ్యవహరిస్తున్నారన్నారు. చాలా మార్లు ఈఓపీఆర్డీని, ఎంపీడీఓను కలిశానన్నారు. తన అర్జీని పరిష్కరించకపోవడంపై ఈఓపీఆర్డీకి సంజాయిషి లెటర్ ఇచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారన్నారు. ఈఓపీఆర్డీపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

నారాయణ విద్యాసంస్థలపై ఫిర్యాదు

ప్రొద్దుటూరు : పట్టణంలోని నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ సోమవారం తహసీల్దార్ గంగయ్యకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే నారాయణ విద్యాసంస్థల్లో రూ.10వేల నుంచి రూ.15వేలు తీసుకుని పుస్తకాలు అమ్మడం, అప్పుడే క్లాసులు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు నారాయణ విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని, అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సరుకులు సక్రమంగా సరఫరా చేయండి


పౌరసరఫరాల గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ

బద్వేలు అర్బన్ : ప్రజలకు పంపిణీ చేసే నిత్యావసర సరుకులను సకాలంలో సక్రమంగా ఆయా రేషన్ దుకాణాలకు సరఫరా చేయాలని ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ పేర్కొన్నారు. స్థానిక సిద్దవటం రోడ్డులోని పౌరసరఫరాల గోడౌన్‌ను సోమవారం ఆర్డీఓ తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న రేషన్ నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ దుకాణాలకు, సంక్షేమ వసతి గృహాలకు, అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే బియ్యం నాణ్యతను తరచూ పరిశీలిస్తుండాలని సూచించారు. ఎటువంటి పొరపాట్లకు, అవకతవకలకు తావు లేకుండా, తూకాల్లో తేడా లేకుండా చూడాలని కోరారు. అలాగే గోదాము నుండి నిత్యావసర సరుకులు బయటికి తీసుకెళ్లి రేషన్ దుకాణానికి చేర్చే వరకు సంబంధిత కార్యాలయ సిబ్బంది పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు ఉదయ భాస్కర్‌రాజు, గోడౌన్ ఇన్‌చార్జి అలీఖాన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్స్ మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలి


మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని

అట్లూరు : కానిస్టేబుల్స్ మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కానిస్టేబుల్ అభ్యర్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గత ప్రభుత్వం 2022లో నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఏడాది కావస్తున్నా కానిస్టేబుల్ పరీక్షలు నిర్వహించి పోస్టులు భర్తీ చేయలేదన్నారు. ఈప్రభుత్వం ప్రిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేష్ అధికారంలోకి వచ్చిన ఆరె నెలల్లో కోర్టు కేసులను క్లియర్ చేసి పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఇంతవరకూ అతిగతి లేదన్నారు. మాది మంచి ప్రభుత్వం అని కార్యాక్రమాలు చేసుకోవడం కాదని నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చినప్పుడే మంచి ప్రభుత్వం అవుతుందని లేక పోతే ముంచే ప్రభుత్వం అవుతుందన్నారు.తమ స్వలాభం కోసం స్వంత ప్రయోజనాల కోసం కోట్లు కర్చు పెట్టి సుప్రిం కోర్టులో లాయర్‌కు కర్చు పెట్టుకుని కోర్టులో వాయిదా వేయించుకుంటారుకానీ నిరుద్యోగులకు కోర్టులో లాయర్ ను పెట్టి కోర్టులో కేసులు పరిష్కారం చూపే చర్యలు మాత్రం చేపట్టరు ఇది ఎక్కడ న్యామన్నారు. ఇక నైనా సుప్రింకోర్టులో ఉన్న కేసులను పరిష్కరించి పాత పద్దతిలో రిజర్వేషన్‌ల ప్రకారం పోస్టులు భర్తీ చేసేలా పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ అట్లూరు మండల నాయకులు శ్రీకాంత్, భాను, విష్ణు, అజయ్ పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణ బలోపేతంతో స్థిరమైన భవిష్యత్తు


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : స్థిరమైన భవిష్యత్ కోసం ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని జమ్మలమడుగు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శ్రీరాములపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో సోమవారం సమావేశం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ తల్లి, నవజాత శిశువుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. దీర్ఘకాలిక శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వాలని, తల్లి, పిల్లల ఆరోగ్యాన్ని మెరుగు పరిచి మరణాల శాతం తగ్గించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి భరత్ నారాయణ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

■ సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ నుంచి ర్యాలీ నిర్వహించారు. 2025 సంవత్సరానికి గాను ప్రపంచ ఆరోగ్య సంస్థ 'ఆరోగ్యకరమైన ప్రారంభం- ఆశాజనక భవిష్యత్తులు' అనే అంశంతో ముందుకు వెళ్లాలని సూచించినట్లు డాక్టర్ నల్లబల్లి హిమబిందు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్‌మాస్టర్ జి.గురప్ప, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సిర్డ్ సొసైటీ ప్రెసిడెంట్ ఎంవీ సుబ్బారెడ్డి, సెక్రటరీ ఒంటెద్దు చెన్నమ్మ, సభ్యులు రమణమ్మ, గంగాభవాని, అల్లాబకాష్, ఆశా, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డ క్షేమం


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బి.కోడూరు : బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం ఆరోగ్యకరమైన ప్రారంభం - ఆశాజనక భవిష్యత్తు అనే నినాదంతో ఆరోగ్య దినోత్సవం ప్రాధాన్యతను వివరిస్తూ వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ సరైన వయస్సులో వివాహం చేసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరగాలని, దీంతో తల్లీబిడ్డ ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వలన తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆరోగ్య దినోత్సవంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కంటి అధికారి హుసేనయ్య, పీహెచ్ఎన్ పుష్పాంజలి, సూపర్‌వైజర్ జాన్‌విలియం, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఫార్మసిస్టు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

• ఘనంగా సీతారామచంద్రస్వామికి సామ్రాజ్య పట్టాభిషేకం


సామ్రాజ్య పట్టాభిషేకంలో శ్రీఅభయ వరద శ్రీసీతారామచంద్ర స్వామి


పూర్ణాహుతి సమర్పిస్తున్న వేద పండితులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మూడో రోజు సోమవారం శ్రీఅభయ వరద శ్రీసీతారామచంద్రస్వామికి సామ్రాజ్య పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. మంటపార్చన, దీక్షా హోమాలను నిర్వహించి శ్రీఅభయ వరద శ్రీసీతారామచంద్ర స్వామికి స్నపన తిరుమంజనం, సామ్రాజ్య పట్టాభిషేకం మహోత్సవం నిర్వహించారు. వేదపండితులు మహా పూర్ణాహుతి సమర్పించి కార్యక్రమాలను పూర్తి చేశారు. స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

• వైభవం.. సీతారాముల గ్రామోత్సవం

రాజుపాళెం : శ్రీరామనవమి పండుగ సందర్భంగా రాజుపాళెంలో గరుత్మంతుడి వాహనంపై సీతారాముల గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది ఈ గ్రామంలో ఒక రోజు ఆలస్యంగా పండుగ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ ధర్మకర్త సుంకు రామకృష్ణయ్య, గ్రామస్తులు, భక్తులు స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం రాత్రి 11 గంటలకు ప్రారంభమై మంగళవారం తెల్లవారుజామున 6 గంటలకు ముగిసింది. గ్రామంలోని వీధుల్లో స్వాములు ఇంటి ముందుకు రాగానే భక్తులు బిందెతో నీళ్లపోసి టెంకాయ కొట్టి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కొంతమంది యువకులు గ్రామోత్సవంలో తెల్లవారేంత వరకు సేవ చేశారు. ముందుగా రామాలయంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వాములకు అర్చకులు నాగేంద్రశర్మ స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు, ప్రజలు స్వాములకు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తిమ్మాయపల్లెలో బేస్‌మెంట్ కూల్చివేత

టీడీపీ వర్గీయుల కక్ష సాధింపు అంటున్న బాధితురాలు


తిమ్మాయపల్లెలో పట్టా నెంబరు 55లో జేసీబీతో బేస్‌మెంట్ తొలగిస్తున్న దృశ్యం

చాపాడు : మండల పరిధిలోని తిమ్మాయపల్లె గ్రామ సమీపంలో ఇందిరమ్మ కాలనీలో రేకలకుంట మహబూబ్ బీ కి చెందిన బేస్‌మెంట్‌ను సోమవారం అధికార యంత్రాంగం కూల్చి వేశారు. బాధితురాలి వివరాల మేరకు.. సర్వే నెంబరు 77/3లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలను పంపిణీ చేసింది. ఈ క్రమంలో పట్టా నెంబరు 55 పట్టా పొందిన తాను ఈ స్థలంలో బేస్‌మెంట్ నిర్మించుకున్నట్లు తెలిపారు. అయితే 2021లో ఈ స్థలం తనది కాదని అంగన్వాడీ కేంద్రానికి కేటాయించిందని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కోర్టుకు వెళ్లి ఇంటి నిర్మాణ పనులు ఆగేలా చేశారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో సోమవారం తన వద్ద ఉన్న పట్టా నకిలీదని, రెవెన్యూ, పంచాయతీ, పోలీసులు, అధికారుల పర్యవేక్షణలో జేసీబీ చేత బేస్‌మెంట్‌ను కూల్చివేశారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు సెంట్లలో ప్రభుత్వ భవనాలు నిర్మించేందుకు ఎలా సరిపోతుందని ఆమె ప్రశ్నిస్తున్నారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణారెడ్డిని వివరణ కోరగా.. హై కోర్టు ఆదేశాల మేరకు తిమ్మాయపల్లెలో ఇందిరమ్మ కాలనీలో పట్టా నెంబరు 55లోని స్థలంపై విచారణ జరిపామన్నారు. దీనిని అప్పటి రెవెన్యూ అధికారులు అంగన్వాడీ స్థలానికి కేటాయించారని, ఈ పట్టాను వ్యక్తిగతంగా ఎవరికీ కేటాయించలేదని తెలిపారు.

ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలు చేయాలి


జాతీయ మహాసభల వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

బద్వేలు అర్బన్ : భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలు చేసి నిరుద్యోగ యువతను ఆదుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయం జేవీభవన్‌లో నిర్వహించిన సమావేశంలో మే నెలలో జరగనున్న ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో అత్యధికంగా దాదాపు 65 శాతం యువత ఉందని, అయితే యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నాయని అన్నారు. ప్రతిఒక్కరికి విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పిస్తే ప్రపంచ దేశాల అన్నింటి కంటే మన దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, అయితే పాలకులు ఆ దిశగా ఆలోచన చేయకుండా ఆ మూడు రంగాలను ప్రైవేటీకరణ చేస్తున్నాయని అన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్, జిల్లా సమితి సభ్యులు లోకేష్, సుధాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అభివృద్ధి ప్రణాళికపై అవగాహన


మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజ, మురళీధర్‌రెడ్డి

అట్లూరు : వ్యవసాయ అభివృద్ధి ప్రణాళికపై ఎప్పటికప్పుడు ప్రణాళికలు తయారు చేసుకోవాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ, పోరుమామిళ్ల వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బద్వేలు వ్యవసాయ డివిజన్ కార్యాలయంలోని సోమవారం బద్వేలుతో పాటు, అట్లూరు, గోపవరం, పోరుమామిళ్ల, కలసపాడు, బి.కోడూరు, కాశినాయన మండలాల వ్యవసాయ అధికారులతో సమావేశమయ్యారు. వర్షపాతం, వివిధ పంటల సాగు విస్తీర్ణం, ఉత్పత్తి, ఎరువుల వినియోగం, ఉత్పాదక సమస్యలు, దిగుబడి నాణ్యత పెంచడం కోసం ప్రణాళిక గురించి చర్చించారు. అలాగే వ్యవసాయ అనుబంధ శాఖల సమన్వయం, యాంత్రీకరణ, సాగునీటి లభ్యత వంటి అంశాలపై చర్చించి ప్రణాళికలు రూపొందించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న అర్బన్ సీఐ రాజగోపాల్

బద్వేలు అర్బన్ : ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం తమ పాఠశాలలలోని ప్రతి తరగతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అర్బన్, రూరల్ సీఐలు ఎం.రాజగోపాల్, ఎం.నాగభూషణ్‌లు పేర్కొన్నారు. ఇటీవల పట్టణంలోని రెండు ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థినులపై అక్కడ పనిచేసిన ఉపాధ్యాయులు అసభ్యంగా ప్రవర్తించిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక సాయివిద్యానికేతన్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంతో లైంగిక వేధింపుల నుండి పిల్లలను రక్షించడం ఎలా అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో పిల్లలు ఇంట్లో తల్లిదండ్రుల వద్ద కంటే పాఠశాలలోనే ఎక్కువ సమయం గడుపుతారని, ఈ క్రమంలో ఉపాధ్యాయులు మంచి ప్రవర్తన కలిగి ఉండటంతో పాటు విద్యార్థులకు కూడా మంచి ప్రవర్తన అలవడేలా కృషి చేయాలని కోరారు. అలాగే ఆయా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ఉపాధ్యాయులను భర్తీ చేసుకునే సమయంలో వారి బోధన నైపుణ్యాలతో పాటు వ్యక్తిగత లక్షణాలను కూడా క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. అలాగే ప్రతి పాఠశాలలో విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించాలని కోరారు. అలాగే ఆయా పాఠశాలల యాజమాన్యం తమ పాఠశాలలో పనిచేస్తుండే ఉపాధ్యాయుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని, ఇందుకోసం తరచూ విద్యార్థులతో, ఉపాధ్యాయులతో వేరువేరుగా సమావేశాలు నిర్వహించాలని కోరారు. అలాగే ఇళ్ల వద్ద తల్లిదండ్రులు కూడా పిల్లల ప్రవర్తనను గమనిస్తుండటంతో పాటు వారిని సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలని కోరారు. సదస్సులో ఎంఈఓ రఘురాములు, అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ, ప్రైవేటు పాఠశాలల యూనియన్ రాష్ట్ర నాయకులు నాగిరెడ్డిశంకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు టి.రత్నం, ఆయా ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.